


నేడు ఫెన్సింగ్ జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని విజ్జీ స్టేడియంలో ఆదివారం ఫెన్సింగ్ జిల్లా జట్టును ఎంపిక చేయనున్నట్లు ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి డి.వి.చారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెంది అక్టోబర్ నెలాఖరికి 14 ఏళ్ల వయస్సు ఉన్న ఫెన్సింగ్ క్రీడాకారులు ఈ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనడానికి అర్హులని పేర్కొన్నారు. వ్యక్తిగత ఫెన్సింగ్ క్రీడా పరికరాలతో హాజరు కావాలని, మరిన్ని వివరాలకు 8374737707 (డి.వి.చారి) సంప్రదించాలని సూచించారు.

- మెంటాడ దారిలో ఐదేళ్లుగా నరకయాతన
- 11 కిలోమీటర్ల రోడ్డులో చిన్నపాటి చెరువులే
- అధ్వానంగా గ్రామీణ ప్రాంత రోడ్లు
- అధికారుల నిర్లక్ష్యంతో ప్రజల ప్రాణాలకు ముప్పు



గంగచోళ్లపెంట వద్ద చిన్నపాటి చెరువును తలపిస్తున్న రోడ్డు

ఆ రహదారులపై ప్రయాణం
ప్రాణాలతో చెలగాటం

ప్రజాశక్తి - గజపతినగరం

గజపతినగరం నియోజకవర్గ పరిధిలో పలు రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ప్రమాదకరంగా మారాయి. నియోజకవర్గ కేంద్రమైన గజపతినగరం నుంచి మెంటాడ మండల కేంద్రానికి దాదాపు 11 కిలోమీటర్ల మేర ప్రధాన రహదారి ఉంది. గజపతినగరం మండలంలోని పలు గ్రామాలతోపాటు మెంటాడ మండల ప్రజలకు, అటు పాడేరు జిల్లాలోని అనంతగిరి మండలానికి వెళ్లే ప్రధాన మార్గమిది. మెంటాడ మండల ప్రజలు అటు విశాఖ వెళ్లాలన్నా, ఇటు గజపతినగరం రావాలన్నా ఈ రోడ్డే ఆధారం. అందుకే కాబోలు దీనిని మెంటాడ మండలానికి గుండెకాయ లాంటిదని పిలుస్తారు. సుమారు 11 కిలోమీటర్ల విస్తీర్ణం కలిగిన ఈ రోడ్డు ఘోరంగా తయారైంది. గత ఐదేళ్లలో మెంటాడ మీదుగా వేసిన గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ సమయంలో భారీ వాహనాలు ముడిసరుకులు తీసుకుని వెళ్లడంతో రోడ్డు పూర్తిగా పాడైపోయింది. ప్రస్తుతం ప్రమాదాల వలయంగా మారింది. గుంతలు తప్ప రోడ్డు ఎక్కడా కనిపించడం లేదని చెబుతారంటే అతిశయోక్తి కాదు. ప్రధానంగా గంగచోళ్లపెంట గ్రామ సమీపంలో రోడ్డు పూర్తిగా ధ్వంసమై, వర్షపు నీటితో నిండి చిన్నపాటి చెరువులను తలపిస్తుంది. మండల కేంద్రానికి అత్యంత కీలకమైన ఈ రోడ్డుపై నిత్యం మండల నాయకులు, అధికారులు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ రోడ్డు బాగుచేయడంపై దృష్టిసారించడం లేదన్న విమర్శ ఉంది. ఎప్పుడో ఒకప్పుడు పెద్ద ప్రమాదం జరిగే వరకు అధికారులు నిద్రపోతారా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఇదొక్కటే కాదు, నియోజకవర్గ పరిధిలో గంట్యాడ, దత్తిరాజేరు, గజపతినగరం, జామి, బొండపల్లి మండలాల్లోని గ్రామాల అనుసంధాన రోడ్లపై ఎక్కడికక్కడ గోతులు ఏర్పడ్డాయి. అనేక రహదారులు ఛిద్రమయ్యాయి. ఇటీవల వర్షాల సమయంలో మరింత దెబ్బతిన్నాయి. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ఆర్అండ్‌బి అధికారులు స్పందించి రహదారి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలని, మలుపుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

గుంతలమయమైన తారు రోడ్డు

గజపతినగరం మండల కేంద్రం నుంచి దిగువ వీధి మీదుగా పైడితల్లమ్మ కోవెల వరకు రహదారి పూర్తిగా గుంతలమయం అయ్యింది. అటుగా వెళ్లే ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. వర్షం పడిందంటే ఎక్కడ రోడ్డు ఉందో తెలియని పరిస్థితి. చిన్నపాటి వర్షానికి గుంతలో నీరు చేరి చెరువును తలపిస్తుంది. దీంతో తరచూ ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ రహదారిని బాగు చేయాలని పలువురు కోరుతున్నారు.



గుంతలమయమైన రోడ్డు

గజపతినగరం మండలంలో కొణిశ నుంచి బొండపల్లి మండలంలో గొల్లుపాలెం వరకు తారురోడ్డు మంజూరైంది. పనులు కూడా ప్రారంభించారు. కారణమేమిటో తెలియదు కానీ అర్ధాంతరంగా పనులు నిలిపేశారు. దీంతో రోడ్డుపై రాళ్లు తేలిపోయాయి. దమ్ము ట్రాక్టర్ల రాకపోకలతో కొణిశ సమీపంలోని చెరువు మధుము వద్ద రోడ్డు ఘోరంగా దెబ్బతింది. కనీసం నడవడానికి ప్రజలు అవస్థలు పడుతున్నారు.

గజపతినగరం మండలంలో లింగాలవలస నుంచి దత్తిరాజేరు మండలం గడసాం మీదుగా పోరలి వరకు సుమారు 13 కిలోమీటర్లు దూరం. ఈ రహదారి పనులు దాదాపు రెండున్నర ఏళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగించే ప్రయాణికులు, ఆయా గ్రామస్తులు నరకయాతన అనుభవిస్తున్నారు.

గజపతినగరం-మెంటాడ రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్లు కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు సమీపించే వరకూ కనిపించడం లేదు. గత నెలలో దసరా సమయంలో గంగుచోళ్లపెంట సమీపంలో అదే గ్రామానికి చెందిన యువకుడు బైక్‌పై కొణిశ జంక్షన్ వైపు వెళ్తుండగా, మెంటాడ మండలం పిట్టాడ గ్రామానికి చెందిన మరో యువకుడు స్నేహితుడితో బైక్‌పై గజపతినగరం వస్తుండగా ఎదురుగా వచ్చిన వాహనం కనిపించక ఢీకొన్నారు. దీంతో ప్రాణాపాయ స్థితికి వెళ్లారు.

నిధులు వచ్చాయి

గజపతినగరం-మెంటాడ రహదారిపై కొత్త లేయర్ వేయడానికి రూ.4.50 కోట్లు విడుదల అయ్యాయి. గత కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పనులు ప్రారంభించడంలో ఆలస్యమవుతోంది. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలు, మలుపుల వద్ద బోర్డుల విషయంపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

- అజయ్ భార్గవ్, ఆర్అండ్‌బి జెఇ, గజపతినగరం



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ఉమ్మడి సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో వివిధ రకాల పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ లేకపోవడం వల్ల చాలా రకాల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, వెంటనే 73, 74 జిఒల ప్రకారం ఉమ్మడి సర్వీసులు కల్పించాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో శనివారం జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వీస్ రూల్స్ లేకపోవడం వల్ల డిఇఒ, డిప్యూటీ డిఇఒ వంటి క్రియాశీలకమైన, పాఠశాలలో తనిఖీ చేయాల్సిన పోస్టులలో ఒక్క ఉపాధ్యాయుడు ప్రమోషన్ పొందకపోవడం శోచనీయమన్నారు. పాఠశాల విద్యలో క్రియాశీలకంగా ఉన్న ఎంఇఒ-1 నియామకాల్లో ఈ సర్వీస్ రూల్స్ లేక 400 పైగా మండలాల్లో మండల విద్యాశాఖ అధికారులు లేకుండగానే విద్యా సంవత్సరం పూర్తయిపోతోందన్నారు. వెంటనే ఉమ్మడి సర్వీసులు ఏర్పాటు చేసి విద్యారంగ పటిష్టతకు తోడ్పడాలని డిమాండ్ చేశారు .

టెట్ నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలి.

2010కి ముందు నియమించబడ్డ ఉపాధ్యాయులను టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) ఉత్తీర్ణత కావాలనే సుప్రీంకోర్టు ఉత్తర్వుల నుండి ఉపాధ్యాయులను మినహాయించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వెంకటేశ్వర్లు డిమాండ్‌చేశారు. డిఎస్‌సి రాసి ఉద్యోగం పొందిన ఉపాధ్యాయులకు నేడు టెట్ పాస్ కావాలనే నిబంధనను తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని కేంద్ర, రాష్ట్ర మానవరుల శాఖలను కోరుతున్నామన్నారు. దేశంలో చాలా రాష్ట్రాలు, ఎస్‌టిఎఫ్ఐ లాంటి ఉపాధ్యాయ సంఘాలు సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్లు దాఖలు చేశాయని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని విద్యాహక్కు చట్టానికి సవరణలు చేసి, టెట్ నుంచి ఉపాధ్యాయులను మినహాయించే విధంగా చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహన్ రావు, జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి జెఎవిఆర్‌కె ఈశ్వరరావు, జిల్లా సహాధ్యక్షులు వి.ప్రసన్నకుమార్, జిల్లా కార్యదర్శులు కె.ప్రసాదరావు, చుక్క తిరుపతినాయుడు, అల్లు శంకర్రావు, బి.రాజారావు, ఎన్.సత్యనారాయణ, ఆడిట్ కమిటీ కన్వీనర్ కె.అప్పారావు, ఎస్.వెంకట్రావు, జి.సుశీల, జి.గంగాధరరావు, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు, నాయకులు

వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా
12న ప్రజా ఉద్యమం

వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 12న ప్రజా ఉద్యమం చేపడుతున్నట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు చెప్పారు. నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ర్యాలీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. దీనికి సంబంధించి కోటి సంతకాల సేకరణ ఇప్పటికే మొదలైందని, ప్రజల్లో భారీ స్పందన వచ్చిందని చెప్పారు. శనివారం ధర్మపురిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. విద్య, వైద్యం ప్రజల కనీస హక్కన్నారు. ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వం వీటిని ప్రజలకు దూరం చేస్తోందని విమర్శించారు. వైసిపి ప్రభుత్వంలో అమలైన పథకాలకు పేర్లు మార్చడం, తమ హయాంలో చేసిన పనులను టిడిపి నేతలు వారి ఖాతాలో వేసుకోవడం తప్ప ఈ 17 నెలల్లో వీరు చేసింది కొత్తగా ఏమైనా ఉందా? అని ప్రశ్నించారు. ఇటీవల తుపాను ధాటికి జిల్లాలో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, వాటికి సంబంధించి పంట నష్టాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదించాలని కోరారు. తడిచిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్‌చేశారు. అనంతరం ప్రజా ఉద్యమం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శులు నెక్కల నాయుడుబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఇప్పలి అనంత్, నరసింహ మూర్తి, గొర్లె రవి, శంబంగి వేణు, ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు జైహింద్ కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా కనకదాసు జయంతి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

భక్త కనకదాసు జయంతిని శనివారం స్థానిక బిసి సంక్షేమ శాఖ కార్యాలయంలో డిఆర్ఒ, సిపిఒ, డిబిసిడబ్ల్యుఒ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించారు. కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖాధికారులు, వార్డెన్లు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లను పరిశీలించిన కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నగరంలోని అన్న క్యాంటీన్లను శనివారం కమిషనర్ పల్లి నల్లనయ్య పరిశీలించారు. పరిశుభ్రతతో అందిస్తున్నారా? లేదా? అని పరిశీలించారు. అన్న క్యాంటీన్ల పరిసరాలు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండే విధంగా సూచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. వేడివేడి ఆహార పదార్థాలు అందుతున్నాయా? లేదా? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు మూడు అన్న క్యాంటీన్లలో 1500 మంది వరకు అల్పాహారాన్ని, 1700 మంది వరకు మధ్యాహ్న భోజనాన్ని, 800 వరకు రాత్రి భోజనాన్ని అందిస్తున్నట్లు చెప్పారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ● ఉత్సాహంగా ప్రారంభమైన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర స్థాయి అండర్-19 ఖోఖో పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. శనివారం స్థానిక విజ్జీ మైదానంలో నిర్వహించిన ఈ పోటీలను మంత్రి కొండపల్లి, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విజయనగరం ఖోఖో, కబడ్డీ క్రీడలకు ప్రసిద్ధి అన్నారు. అటువంటి జిల్లాలో రెండు రోజుల పాటు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.

క్రీడా స్ఫూర్తితో ఆడి, జాతీయ పోటీలకు ఎంపికై మన రాష్ట్ర ప్రతిష్టను ఇనుమడింప చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌జిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తి, జిల్లా ఇంటర్ విద్యా శాఖ అధికారి ఎస్.తవిటినాయుడు, వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులు పాల్గొన్నారు.





ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ; క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే అదితి

నేడు ఎస్.కోటలో రైతుసంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

శృంగవరపుకోటలో ఎపి రైతు సంఘం జిల్లా మహాసభను ఆదివారం నిర్వహిస్తున్నామని ఆ సంఘం జిల్లా కార్యదర్శి బుద్ధరాజు రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎపి రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి..క్రిష్ణయ్య, ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ హాజరవుతారని చెప్పారు. శనివారం శృంగవరపుకోటలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మహాసభ సందర్భంగా పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు కోలాటాల నడుమ రైతులతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం పట్టణంలోని మహాత్మా గాంధీ పార్క్ ఆవరణలో మహాసభ నిర్వహిస్తామన్నారు. రైతులు చైతన్యంతో ఐక్యమై వ్యవసాయాన్ని, పాడిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో జిల్లా మహాసభలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాట కార్యాచరణను రూపొందిస్తామన్నారు. మహాసభకు జిల్లా నలుమూలల నుంచి రైతులు, పోలవరం ఎడమ కాలువ, బైపాస్ రోడ్డు నిర్వాసితులు, పాడి రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

ఇంజినీరింగ్ అధికారులతో చర్చలు విఫలం

ఆరో రోజు కొనసాగిన కాంట్రాక్టర్ల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరపాలక సంస్థలో బకాయి బిల్లులు చెల్లించాలని మున్సిపల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చేపట్టిన సమ్మె ఆరో రోజుకు చేరుకుంది. శుక్రవారం రాత్రి ఇంజినీరింగ్ అధికారులతో జరిగిన చర్చల్లో సానుకూల నిర్ణయాలు రాకపోవడంతో శనివారం ఆరోరోజు ధర్నాను కాంట్రాక్టర్లు కొనసాగించారు. తమతో పనులు చేయించుకుంటున్న నగర పాలక సంస్థ అధికారులు చేసిన పనికి డబ్బులు ఇచ్చే విషయంలో ఎందుకు పిల్లిమొగ్గలు వేస్తున్నారో అర్థం కావడం లేదని అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు లింగారావు, అశోక్, అధ్యక్ష, కార్యదర్శులు బంగార్రాజు, రాజ్ కుమార్ ఆగ్రహం వ్యక్తంచేశారు. డబ్బులు లేనప్పుడు టెండర్లు పిలవడం మానేయాలి తప్ప బిల్లులు చేయకుండా ఇలా సంవత్సరాల తరబడి కాలయాపన చేయడం ఏమి న్యాయమని ప్రశ్నించారు. ధర్నాలో కాంట్రాక్టర్లు దువ్వి శ్రీనివాసరావు, తిరుపతిరావు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఎపి అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి రాష్ట్ర చైర్మన్ దూసి భానోజీ రావు డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లాల అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి చైర్మన్ గండిపల్లి మహేంద్ర అధ్యక్షతన శనివారం స్థానిక కెఎల్ పురం కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లాల మహాజన సభలో ఆయన మాట్లాడారు. సర్వీసు రూల్స్‌తో పాటు సెర్ప్, మెప్మా ఉద్యోగులకు అమలు చేస్తున్న హెచ్ఆర్ పాలసీనిఅవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వర్తింపజేయాలని కోరారు. పిఆర్‌సిలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీసం వేతనం కింద ఆఫీసు సబార్డినేట్‌కు ఉన్న రూ.26 వేలు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ.28 వేలు, డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్‌కు రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వివిధ శాఖల్లోని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కోస్‌లో కలపాలని కోరారు. జిల్లా చైర్మన్‌గా జి.మహేంద్ర బాబు, ప్రధాన కార్యదర్శిగా పి.శ్రీను, కోశాధికారిగా పి.గోపాల్‌తో నూతన కమిటీని నియమించారు. కార్యక్రమంలో జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.గురునాథ్, వైస్ చైర్మన్ కెవై దివాకర్ బాబు, ట్రెజరర్ యు.అనిల్ కుమార్, జాయింట్ సెక్రటరీ ఎ.రంగభాస్కర్, శివ దేవి పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కంటోన్మెంట్

జర్నీ లైఫ్ సొసైటీ, శ్రీశ్రీ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యాన శనివారం స్వచ్ఛంద రక్తదాన శిబిరం నిర్వహించారు. నగరంలోని శ్రీశ్రీ కోచింగ్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన ఈ శిబిరాన్ని గాయత్రి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఎమ్‌డి జి.బి.వి వెంకట్ ప్రారంభించారు. కార్యక్రమంలో జర్నీ లైఫ్ సొసైటీ అధ్యక్షులు పి.కె.ఎల్ రాజు, స్వామి వివేకానంద నగరపాలక ప్రాథమిక ఉన్న ఉపాధ్యాయులు పొట్ట శ్రీనివాసరావు, రక్తదాత, ఆశ్రయ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షులు బి.రామకృష్ణారావు, డాక్టర్ దుర్గాప్రసాద్, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి ఎం.రాము, తదితరులు పాల్గొన్నారు.

చిన్న శ్రీను వ్యాఖ్యలు అర్థరహితం : టిడిపి

ప్రజాశక్తి-విజయనగరం కోట

కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడుపై జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. శనివారం విజయనగరంలో నాగార్జు మాట్లాడుతూ మజ్జి శ్రీనివాసరావు భోగాపురం విమానాశ్రయం కోసం భూసేకరణ చేసింది వైసిపి ప్రభుత్వమని, టిడిపి ప్రభుత్వం ఏమీ చేయలేదని మాట్లాడటం హాస్యాస్పదం అన్నారు. వైసిపి ఐదేళ్ల అధికారంలో ఉండి విమానాశ్రయాన్ని ఎందుకు చిత్తశుద్ధితో నిర్మించలేదని, ప్రజలకు ఎందుకు అంకితం చేయలేదని ప్రశ్నించారు. మరో ఏడాదిలో విమానాశ్రయ నిర్మాణం పూర్తి చేసి ప్రభుత్వం ప్రజలకు అంకితం చేస్తుందని తెలిపారు.

పిపిపి పేరిట మెడికల్ మోసం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

పిపిపి (పబ్లిక్ - ప్రయివేట్ - పార్టనర్‌షిప్) పేరుతో ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రయివేటుపరం చేస్తే జిల్లా మరోసారి మోసపోయినట్టే. తద్వారా కేవలం ఆసుపత్రిలో వైద్యసేవలు పేదలకు అందుబాటులో ఉండకపోవడం మాత్రమే కాదు సుమా..! కాలేజీలో మెరిట్ కోటా తగ్గిపోతుంది. ఫీజుల భారాన్ని భరించలేని పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమౌతారు. అంతే కాదు... అందులో పనిచేసే ఉద్యోగులు, సిబ్బందికీ ఉద్యోగ భద్రత కొరవడుతుంది. పర్మినెంట్‌కు బదులు కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు మాత్రమే దొరుకుతాయి. వీరికి పనికి తగ్గవేతనం, ఇతర సదుపాయాలు ఉండేందుకు కూడా అవకాశం ఉండబోదు. సరిగ్గా ప్రభుత్వ అసలు లక్ష్యం కూడా ఇదే. తాజాగా జిల్లాలోనూ ఇదే చర్చ మొదలైంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీలను పిపిపి పేరిట ప్రయివేటు సంస్థలకు అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయం చేసిన సంగతి విదితమే. దీనిని వామపక్షాలు తొలి నుంచీ వ్యతిరేకిస్తున్నాయి. ఇటీవల వైసిపి కూడా ఆందోళనలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం జరిగిన ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఈ అంశం కీలక అజెండాగా అయ్యింది. పిపిపి పద్ధతిని తాము వ్యతిరేకిస్తున్నామంటూ వైసిపి సభ్యులు చెప్పగా, పిపిపి అంటే ప్రయివేటు కాదంటూ జిల్లాకు చెందిన రాష్ట్ర ఎంఎస్ఎంఇ మంత్రి కొత్త భాష్యం చెప్పారు. పిపిపి అంటే ప్రయివేటు కాదని, ప్రజల భాగస్వామ్యమని చెప్పారు. అలాంటప్పుడు ప్రయివేటు అనే పదం దేనికి వచ్చిందో మాత్రం చెప్పలేదు. పిపిపిపై ఎవరితోనైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధం.. అంటూ మంత్రి విసిరిన సవాలును ప్రతిపక్షంలో కీలకంగా ఉన్న జెడ్‌పి చైర్మన్ ఎందుకు స్వీకరించలేదో వైసిపికే ఎరుక. ఇంతలా వ్యతిరేకిస్తున్న ఆ వైసిపి చర్చకు ఎందుకు సిద్ధం కావడం లేదో? అంటూ జనంలో అనుమానాలు మొదలయ్యాయి. ఈ సంగతి కాస్త అటుంచితే, మెడికల్ కాలేజీ ప్రయివేటీకరణపై సభ్యులంతా మూకుమ్మడిగా తీర్మానం పెట్టడం అభినందనీయం. అంతటితో ఆగిపోలేదు. పిపిపి పద్ధతిలో మెడికల్ కాలేజీలు మరింత సమర్థవంతంగా పనిచేస్తాయంటూ మంత్రి చెప్తున్నప్పుడు... మరి ప్రభుత్వ రంగంలో ఆ రకమైన సేవలు అందించలేరా? అంటూ పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నకు ఇద్దరు అమాత్యులూ నీళ్లు నమిలారు.



ప్రభుత్వ రంగంలోని మెడికల్ కళాశాల ప్రయివేటు రంగంలోకి మార్చితే ప్రభుత్వ నియంత్రణ, పారదర్శకత బాగా తగ్గిపోతాయనడంలో సందేహం లేదు. ప్రజా ప్రయోజనాల కంటే లాభాలకే ప్రాధాన్యం ఉంటుంది. లాభాలు లేకుండా ప్రయివేటు సంస్థలు ఎందుకు ముందుకు వస్తాయి?. ఈ విషయం స్కూల్ పిల్లలని అడగ్గానే ఇట్టే సమాధానం చెప్పేస్తారు. చికిత్స ఛార్జీలు, ల్యాబ్ ఫీజులు, హాస్పిటల్ సేవల ధరలు పెరిగే అవకాశం ఉంటుంది. ఫ్రీ బెడ్లు, సబ్సిడీ సేవలు సంఖ్యలో తగ్గిపోతే, గ్రామీణవాసులు, ముఖ్యంగా పేదలు ఇటువంటి ఆసుపత్రిలో సేవలు పొందడం కష్టతరంగా మారుతుంది. ప్రభుత్వ పారదర్శక విధానాలు కంటే వ్యాపార ధోరణికి అనుగుణమైన నిర్ణయాలకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. కరోనా వంటి అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు నాటి జిల్లా కేంద్రాసుపత్రి మాదిరిగా పనిచేసే అవకాశం ఉండబోదు. మిగిలిన ఆసుపత్రుల మాదిరిగా డబ్బుతోనే నడుస్తుంది. మూసివేసినా అడిగే హక్కు ప్రభుత్వం కోల్పోతుంది. 2020, 2021లో ప్రయివేటు ఆసుపత్రులు అనుసరించిన విధానం ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు.

ప్రయివేట్ భాగస్వాములు ఎక్కువగా సీట్ సేల్ లేదా మెనేజ్‌మెంట్ కోటా విధానాలపై ఆధారపడవచ్చు. ఫలితంగా ప్రభుత్వ కోటా సీట్లు తగ్గిపోవచ్చు. ఫీజులు పెరగవచ్చు. ప్రస్తుతం రూ.30 లక్షలు ఉన్న ఫీజు, ప్రయివేటు కంట్రోల్‌కి వెళ్లాక రూ.కోట్లలోకి వెళ్లిపోతుంది. మెరిట్ బేస్డ్ అడ్మిషన్‌లో పారదర్శకత తగ్గవచ్చు. సిబ్బంది భద్రతపై అనిశ్చితి ఏర్పడుతోంది. ప్రభుత్వ ఉద్యోగుల (వైద్యులు, నర్సులు, టెక్నీషియన్లు) సర్వీస్ నిబంధనలు మార్చబడవచ్చు. కొత్తగా నియమించే సిబ్బంది ప్రయివేట్ కాంట్రాక్ట్ ఆధారంగా ఉండవచ్చు, దీనివల్ల వేతన అసమానతలు, ఉద్యోగ భయం రావచ్చు. ప్రభుత్వ వైద్య సంస్థలు 'సామాజిక సేవతో పనిచేస్తాయి. కానీ, ప్రయివేట్ భాగస్వామ్య సంస్థలు 'లాభం' అనే తోవలో ఉంటాయి. ఈ రెండు లక్ష్యాలు ఎప్పుడూ సమానంగా ఉండవు. ఫలితంగా, చికిత్స, పరిశోధన, పబ్లిక్ హెల్త్ పాలసీల్లో వ్యత్యాసం వస్తుంది. అందువల్ల పిపిపి అంటే ప్రయివేటు తోవే. ఆ తోవలోనే మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయడం వల్ల పేదలకు, జిల్లాకు అదనంగా ఒరిగిందేమీ లేదు.

బేబినాయనను కలిసిన బొలిశెట్టి

బొబ్బిలి: బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయనను తాడేపల్లిగూడెం జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసరావు శనివారం బొబ్బిలి కోటలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వ పరిపాలన, ప్రభుత్వ పథకాల అమలు గురించి ఇరువురు చర్చించుకున్నారు. బొబ్బిలి నియోజకవర్గ నాయకులను ఎమ్మెల్యే బొలిశెట్టికి బేబీనాయన పరిచయం చేశారు. అనంతరం, మున్సిపల్ చైర్మన్ రాంబర్కి శరత్‌తో బొలిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడి, బొబ్బిలి పట్టణంలో వారు చేపడుతున్న కార్యక్రమాలను గురించి అడిగి తెలుసుకుని, మరింత అభివృద్ధి చెయ్యాలని కొన్ని సూచనలు చేశారు.

కారు దహనం పిరికిపంద చర్య

నెల్లిమర్ల: వైఎస్ఆర్‌సిపి రాష్ట్ర అధ్యక్షులు గౌతంరెడ్డి కారు దహనం చేయడం పిరికి పంద చర్య అని వైఎస్ఆర్‌సిపి కార్మిక విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి ధవళ లక్ష్మణరావు ఖండించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గౌతమ్ రెడ్డిని ప్రజాస్వామ్య బద్దంగా ఎదుర్కోలేక, భౌతికంగా అంతమొందించడానికి ఈ ప్రభుత్వం కొత్త పన్నాగం పన్నుతుందని, ప్రాణహాని ఉందని స్వయంగా పోలీసులకు చెప్పినా పట్టించుకోలేదని అన్నారు. దుండగుడు పెట్రోల్ పోసి తన షెడ్‌లో ఉన్న కారును అగ్ని పెట్టినా ప్రభుత్వంలో ఎలాంటి స్పందనా లేదంటే దీని వెనుక ప్రభుత్వమే ఉందని ఆరోపించారు. ఉద్యమాలలో రాటుదేలిన గౌతంరెడ్డి ఇలాంటి ఉడత ఊపులకు, తాటాకు చప్పుళ్లకు భయపడే బాపతు కాదని ఈ ప్రభుత్వం తెలుసుకుంటే మంచిదన్నారు. ఈ నెల 12వ తేదీన మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నెల్లిమర్లలో జరుగనున్న ర్యాలీలో కార్యకర్తలు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక

నెల్లిమర్ల: రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు జిల్లా తరఫున క్రీడాకారులు ఎంపికైనట్లు వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి, కోచ్ చల్లా రాము తెలిపారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కొండవెలగాడలో జరిగిన ఎంపికలో 38మంది రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 14,15,16 తేదీల్లో కొండ వెలగాడలో జరుగనున్న రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ పోటీలకు 20 మంది అబ్బాయిలు, 18 మంది అమ్మాయిలు ఎంపికైనట్లు చల్లా రాము తెలిపారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

శృంగవరపుకోట: శ్రీ వివేకానంద జూనియర్ డిగ్రీ కళాశాల యూనిట్ 1,2 ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఆధ్వర్యంలో వారం రోజులు పాటు నిర్వహించిన ప్రత్యేక శిబిరాలు కొత్తూరు, మల్లిపూడి గ్రామాల్లో శనివారం ముగిసాయని ప్రిన్సిపల్ మజ్జి భాస్కరరావు తెలిపారు. ప్రోగ్రామ్ అధికారులు బి.అర్జున్, జె.రమేష్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు కొత్తూరు సర్పంచ్ లక్ష్మి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఈశ్వరరావుకు ఆర్థిక సాయం

వేపాడ: మండల కేంద్రంలోని ఎస్‌సి కాలనీకి చెందిన తానపరపు ఈశ్వరరావు గత కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతూ మంచానికి పరిమితమయ్యాడు. వైద్యానికి ఆర్థిక స్తోమత లేదన్న విషయాన్ని గమనించిన వేపాడ మన నేస్తం స్వచ్ఛంద సంస్థ రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని శనివారం అందించింది.

మహాధర్నాను జయప్రదం చేయాలి

రామభద్రపురం: ఇటీవల జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో ఈనెల 20న న్యూఢిల్లీలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నేత పెంకి సుధాకర్ కోరారు. శనివారం అసంఘం మండల నేతలతో కలిసి మహాధర్నా వాల్ పోస్టర్‌ను విడుదల చేసి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయమూర్తి పై దాడికి పాల్పడిన సనాతన మనువాది రాకేష్ కిషోర్‌ను శిక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కోకన్వీనర్ సురగాల లక్ష్మణరావు, ఆంజనేయులు, రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

శుభ్రం చేసిన నీటిని సరఫరా చేయండి

శృంగవరపుకోట: గ్రామాలలో ప్రజలకు పరిశుభ్రం చేసిన నీరు సప్లయ్ చేయాలని జనసేన నియోజకవర్గ నాయకులు వబ్బిన సన్యాసి నాయుడు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను కోరారు. ఈ సందర్భంగా శనివారం ఆయన తిమిడి, వసి, వేచలపూడి గ్రామాల్లో వస్తున్న తాగునీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతవారం రోజులుగా తాగునీరు ఎర్రని రంగు, మట్టి వాసనతో కొలాయిల నుండి వస్తుందని చెప్పారు. ఇటువంటి నీటిని తాగటం వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని వెంటనే ఆర్‌డబ్ల్యుఎస్ అధికా రులు, తాటిపూడి ప్యూరిఫైడ్ వాటర్ ట్యాంక్ ఉన్న కృష్ణాపురం నుంచి పరిశుభ్రమైన నీరు విడుదచేయాలని పలువురు మహిళలతో కలసి ఆయన కోరారు.

పిఎఫ్ బకాయిలు విడుదల చేయాలి

రామభద్రపురం: పిఎఫ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని ఎపిటిఎఫ్ అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు కోరారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి అత్యవసర పరిస్థితుల దృష్ట్యా ప్రతీ నెల కొంత మొత్తాన్ని పిఎఫ్ ఖాతాలో దాచుకుంటారని వీటితో అనేక కుటుంబ వ్యక్తిగత అవసరాలకు వినియోగించు కోవడం జరుగుతుందని అన్నారు. అయితే ఈ అవసరం ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయులు పిఎఫ్ లోన్లు, పార్ట్ ఫైనల్స్ మొత్తాలు కోసం దరఖాస్తు చేసి 6నెలలు గడుస్తున్నా నేటికి చెల్లించకపోవటం శోచనీయమన్నారు. నెలనెలా దాచుకున్న పిఎఫ్ డబ్బులు కూడా సకాలంలో చెల్లించకపోవటం దారుణమన్నారు. వైద్య ఖర్చులు పిల్లల ఫీజులు చెల్లించలేక అప్పులు చేస్తున్నారన్నారు. కేవలం ఒక్క డిఎ చెల్లించి మిగతా బకాయిలు వాయిదాల రూపంలో పిఎఫ్ ఖాతాలో జమ చేస్తామన్న ప్రభుత్వం మిగిలిన 3 డిఎల సంగతిని మర్చిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డి వేణు, కృష్ణంనాయుడు పాల్గొన్నారు.

'సీతం'లో క్వాంటమ్ కంప్యూటర్ ప్రారంభం



ప్రారంభిస్తున్న మాజీ ఎమ్‌పి ఝాన్సీలక్ష్మి

విజయనగరం: సీతం కళాశాలలో క్వాంటమ్ కంప్యూటింగ్ ప్రయోగ శాలను కరస్పాండెంట్ బొత్స ఝాన్సీలక్ష్మి.. శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త పోకడలను పుణికి పుచ్చుకోవడంలోనూ, విద్యార్థులకు అవగాహన, పరిశోధన అవకాశాలు కల్పించడంలో సీతం కళాశాల ఎప్పుడూ ముందంజలో ఉంటుందన్నారు. కేవలం పాఠ్య పుస్తకాలకు మాత్రమే పరిమితం కాకుండా నైపుణ్యం, సృజనాత్మకత పెంపొందించే దిశలో విద్యార్థులను నడిపించడమే సీతం ధ్యేయమని కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డి.వి.రామమూర్తి, డీన్ జ్ఞాన ప్రసూన, తదితరులు పాల్గొన్నారు.

కెఆర్‌పేట పాఠశాల సందర్శన

వేపాడ: మండలంలోని ఎన్‌కెఆర్‌పురం సెక్టార్ పరిధిలోగల కెఆర్‌పేట ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ పి.బాలభాస్కరరావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రీడింగు, రైటింగ్, వర్క్ బుక్స్, అసైన్మెంట్ వర్క్‌బుక్స్, కిచెన్‌గార్డెన్, పాఠశాల పరిసరాలను పరిశీలన చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిఆర్‌పి సునందన పాల్గొన్నారు.



అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రాజా, తదితరులు

రావిపల్లి అప్పారావు కుటుంబానికి పరామర్శ

బాడంగి: మండలంలోని ఆకులకట్ట గ్రామానికి చెందిన రావిపల్లి అప్పారావు ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో శనివారం ఆ కుటుంబాన్ని బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు పరామర్శించారు. ఈ సందర్భంగా అప్పారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో రావిపల్లి అప్పలనాయుడు, రావిపల్లి సింహాచలం, ఉయ్యాల సత్యనారాయణ, సర్పంచ్, నాయకులు పాల్గొన్నారు.

రైతుల ఆదాయం రెట్టింపు కావాలి: మంత్రి

ప్రజాశక్తి- నెల్లిమర్ల



విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

రాష్ట్రంలో రైతుల ఆదాయం రెట్టింపు చేయడానికి సెంచూరియన్ విశ్వవిద్యాలయం దోహదపడాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన రెండో రైతు సమ్మేళనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో అత్యధిక మంది వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని అది లాభసాటిగా మారేందుకు అవసరమైన పరిజ్ఞానాన్ని విశ్వవిద్యాలయం రైతులకు అందించాలని అన్నారు. ఇక్కడ వ్యవసాయంతోపాటు అనుబంధ పరిశ్రమలైన పందుల పెంపకం వంటి వాటి ద్వారా కూడా రైతులు ఇతర మార్గాలలో ఆదాయం పొందవచ్చని చెప్పారు. రైతులను ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలని కోరారు.

విశ్వవిద్యాలయం వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డి.ఎన్.రావు మాట్లాడుతూ మట్టి లేకుండా వ్యవసాయం, గాలితో పంటలు పండించడం వంటి అత్యధిక విలువైన పంటలు సాగు చేయవచ్చని అన్నారు. వీటిని పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టామన్నారు. విజయనగరం, గజపతినగరం, నెల్లిమర్ల నియోజకవర్గాలలో గ్రామాలను దత్తత తీసుకొని నూతన పద్ధతులను అక్కడ రైతులకు వివరిస్తామన్నారు.

విజయనగరం, నెల్లిమర్ల ఎమ్మెల్యేలు అధితి గజపతిరాజు, లోకం నాగమాధవి మాట్లాడుతూ ఇక్కడ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసి నాలుగేళ్లలోనే మంచి కోర్సులను ప్రవేశపెట్టడమే గాకుండా రైతులకు ఉపయోగపడేలా ఇటువంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందించదగ్గ విషయమన్నారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి చేతుల మీదుగా సిటి స్కాన్ మోడల్ ల్యాబ్, ఎమ్మెల్యే మాధవి చేతుల మీదుగా సైబర్ ఫోరెన్సిక్ ల్యాబ్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు చేతుల మీదుగా మరో రెండు ల్యాబ్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మహంతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దువ్వుపేటలో నేత్ర పరీక్షలు

డెంకాడ: లెండి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఆధ్వర్యంలో శనివారం దువ్వుపేటలో గ్రామస్తులకు ఉచిత నేత్ర పరీక్షలు చేశారు. విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్ నేత్ర ఆసుపత్రితో కలిసి, దువ్వుపేట పాఠశాలలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసి 200 మందికి నేత్ర పరీక్షలు చేశారు. చిన్న చిన్న దృష్టి సమస్యలతో ఉన్న వారికి శిబిరంలోనే ఉచిత మందులు అందించగా, తీవ్ర సమస్యలు ఉన్నవారిని రిఫర్ చేశారు. ముత్యబిందుతో బాధపడుతున్న 50 మందికి పైగా రోగులకు ఉచిత శస్త్రచికిత్సలు శంకర్ ఫౌండేషన్ ప్రధాన ఆసుపత్రిలో నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ రవితేజ, అధ్యాపకులు అజీజ్, విద్యార్థి వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

మోసాల పట్ల ప్రజలను చైతన్యపర్చాలి: ఎస్‌పి

ప్రజాశక్తి- వంగర, రేగిడి, చీపురుపల్లి



పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్‌పి

సైబర్ నేరాలు, మోసాలు పట్ల ప్రజలను పోలీసులు చైతన్య పర్చాలని జిల్లా ఎస్‌పి ఎఆర్.దామోదర్ తెలిపారు. ఆయన శనివారం వంగర, రేగిడి, చీపురుపల్లి పోలీసు స్టేషన్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పోలీసు స్టేషన్ల పరిసరాలను పరిశీలించి, స్టేషను ప్రాంగణాలను సుందరంగా, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలని అధికారులను ఆదేశించారు. పోలీసు స్టేషనులో పని చేసే పోలీసు సిబ్బందితో మమేకమై, వారి వివరాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం, పోలీసు స్టేషనులో నమోదవుతున్న కేసుల తీరును అధికారులను అడిగి తెలుసుకొని, సిడి ఫైల్స్, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు స్టేషనుకు వచ్చే బాధితులు, వృద్ధులు, మహిళలు పట్ల అప్యాయంగా మాట్లాడి, వారి సమస్యలను శ్రద్ధగా విని, పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. డిజిటల్ అరెస్టు, ఆధార్ దుర్వినియోగం, పార్శిల్స్ డ్రగ్స్ ఉన్నాయని, మానవ అక్రమ రవాణ చేస్తున్నట్లుగా కేసు నమోదైందని, సిబిఐ, సుప్రీంకోర్టు న్యాయమూర్తి మాట్లాడుతున్నట్లుగా వచ్చే వాట్సాప్ కాల్స్‌ను నమ్మకుండా ప్రజలను చైతన్యపర్చాలన్నారు. నేరాలు జరిగిన తరువాత చర్యలు చేపట్టేకంటే ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. రహదారి ప్రమాదాలను నియంత్రించేందుకు ప్రతీ వాహనదారుడు హెల్మెట్ ధరించే విధంగా చూడాలని, రహదారి భద్రత నియమాలు పాటించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చిన్న వయస్సు కలిగిన వారిపై లైంగిక వేధింపులు జరగకుండా చూడాలని, స్కూళ్లను మహిళా సంరక్షణ పోలీసులు సందర్శించి, వారికి గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వంటి సున్నితాంశాలు పట్ల అవగాహన కల్పించాలన్నారు. ఈ తనిఖీల్లో చీపురుపల్లి డిఎస్‌పి ఎస్.రాఘవులు, ఎస్‌బిఐ సిఐ ఎ.వి.లీలారావు, రాజాం రూరల్ సిఐహెచ్.ఉపేంద్రరావు, రాజాం సిఐ కె.అశోక్ కుమార్, చీపురుపల్లి సిఐ జి శంకరరావు, ఎస్ఐలు షేక్ శంకర్, వి.బాలకృష్ణ, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌పిని కలిసిన దళిత బహుజన సంఘాల జెఎసి నాయకులు

స్థానిక పోలీసు స్టేషన్‌కు వచ్చిన జిల్లా ఎస్‌పిని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు, దళిత, బహుజన సంఘాల జెఎసి ఉత్తరాంధ్ర అధ్యక్షుడు మజ్జి గణపతి, దళిత సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎం.గణపతిరావు, నాయకుడు డర్రు రాంబాబు, మండల నాయకులు గుండేల మన్మధరావు, టి.సింహాచలం, ఆర్ శ్రీనివాసరావులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎస్‌పితో పాటు పోలీసు అధికారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.



సిసి రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

గ్రామాలాభివృద్ధే కూటమి లక్ష్యం

ప్రజాశక్తి - కొత్తవలస

గ్రామాలాభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండలంలోని గవరపాలెం గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆమె శనివారం ప్రారంభించారు. ఎల్లప్పుడు గ్రామానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన గౌరీ పరమేశ్వరులను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మల్ల రాము, నక్కరాజు, చిన్నరాము, గొంప దుర్గా ఉమేష్, గవర ముత్యాల నాయుడు, దొడ్డి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.



ఆనంద్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే, కర్రోతు, సువ్వాడ, టిడిపి నాయకులు

ఘనంగా ఆనంద్ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

టిడిపి మండల అధ్యక్షులు, ఎయిమ్స్ గ్రూప్ విద్యాసంస్థల అధినేత కడగల ఆనంద్‌కుమార్ పుట్టిన రోజు వేడుకలు శనివారం మండలంలోని గొర్లిపేట సమీపంలో ఘనంగా నిర్వహించారు. గ్రామానికి ఆనుకుని ఉన్న సత్యనారాయణస్వామి ఆలయంలో అభిమానులు, కార్యకర్తల మధ్య వేడుకలను నిర్వహించారు. ముందుగా ఉదయం 7గంటల నుంచి 11 గంటల వరకూ హోమాలు చేశారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. టిడిపి రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవిశేఖర్ ఆధ్వర్యంలో జరిగిన పుట్టిన రోజు వేడుకల్లో ఆనంద్‌కు మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, ఎమ్మెల్యే లోకం నాగమాధవి, మాజీ ఎమ్మెల్సీ రఘువర్మ, టిడిపి సీనియర్ నాయకులు కంది చంద్రశేఖర్, మహంతి చిన్నంనాయుడు, గేదెల రాజారావు, పల్లె భాస్కరరావు, కర్రోతు సత్యనారాయణ శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో విద్యార్థులకు ఆనంద్ యువ సేన సభ్యులు పుస్తకాలు, పెన్నులు, పేదలకు చీరలు, దుప్పట్లు, బట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లెంక అప్పలనాయుడు, ఆల్తి శ్రీనివాసరావు, అట్టాడ శ్రీధర్, గరికిపేట మాజీ సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ, డీలర్ల సంఘం మండల అధ్యక్షులు మహంతి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వసతిపై నిర్లక్ష్యం

- గదులకు కిటికీలుండవు..
- మరుగుదొడ్లకు తలుపులుండవు
- పెచ్చులూడిన భవనంలోనే విద్యార్థుల బస
- వర్షం పడితే నీట మునుగుతున్న భవనం
- ఇదీ మండలంలోని వసతి గృహాల పరిస్థితి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని బిసి వసతి గృహల వసతుల కల్పనపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుంది. ముఖ్యంగా 120 మంది విద్యార్థులున్న బొప్పడాం బిసి సంక్షేమ వసతి గృహం గత కొన్నేళ్లుగా బీటలు వారిన గోడలు, పెచ్చులూడిన స్లాబ్‌తో ఎప్పుడు కూలిపోదామా అన్న చందంగా ఉంది. నిత్యం స్లాబ్ పెచ్చులూడి విద్యార్థులపై పడటంతో భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు విద్యార్థులను పక్కనే ఉన్న జడ్‌పి ఉన్నత పాఠశాలకు తరలించి ఊపిరి తీసుకున్నారు. దీంతో బాటు విద్యార్థులు ఉండే రెండు గదుల్లో కిటికీలకు తలుపులు లేవు. దీంతో వర్షానికి, చలికి వణికిపోతున్నామని విద్యార్థులు చెబుతున్నారు. ఒక్కోసారి విష పురుగులు కూడా తలుపుల్లేని కిటికీల ద్వారా లోపలికి వచ్చేస్తున్నాయని అంటున్నారు. ప్రమాదం జరగకముందే అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇదిలా వుండగా అలుగోలు బిసి వసతి గృహనికి ప్రహరీ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మొయిద బిసి సంక్షేమ వసతి గృహం ఎప్పుడు వర్షాలు కురిసినా గెడ్డపొంగి వసతి గృహాన్ని ముంచడం గత కొన్నేళ్లుగా జరుగుతుంది. కానీ ఎన్ని ప్రభుత్వాలు మారినా బిసి సంక్షేమ వసతి గృహల సౌకర్యాలు పట్టించుకొనే నాధుడు లేదని విద్యార్థుల తలిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కాలంలో జిల్లా న్యాయమూర్తులు కూడా వసతి గృహాలు సందర్శించి సౌకర్యాలు కల్పించాలని ఆదేశాలు జారీ చేసినా ఫలితం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం బిసి వసతి గృహాల సమస్యలపై దృష్టి సారించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



పెచ్చులూడిన వసతి గృహంలో బిక్కుబిక్కుమంటున్న విద్యార్థులు



వరద నీటితో నిండిపోయిన మొయిద వసతి గృహం



ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పరుగు పోటీలకు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి- మెరకముడిదాం

ప్రభుత్వం నిర్వహిస్తున్న పాఠశాల స్థాయి ఆటల పోటీల్లో భాగంగా రాష్ట్రస్థాయి పరుగు పందెం పోటీలకు మండలంలో గర్భాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. 800 మీటర్ల విభాగంలో యల మంచిలి ప్రసాద్, 400 మీటర్ల విభాగంలో బూటు చందు, నాబాన శాంతారావు, 200 మీటర్ల విభాగంలో సుంకరి నవీన్ ఎంపికయ్యారు.

వీరంతా మండల, డివిజన్, జిల్లాస్థాయి పరుగు పోటీలో ప్రథమ స్థానంలో నిలిచారు. రాష్ట్రస్థాయి పరుగు పోటీలకు ఎంపికైన వీరిని ప్రధానోపాధ్యాయులు బి.సూర్యనారాయణ, పీడీ పి.పార్థసారథి, ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామస్తులు శనివారం అభినందించారు.

జిల్లా స్థాయిలో తృతీయం

ప్రజాశక్తి- గజపతినగరం



కీర్తిని అభినందిస్తున్న హెచ్ఎం రమేష్‌కుమార్

జిల్లా స్థాయి నైపుణ్య పోటీల్లో స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని కీర్తన ఉత్తమ ప్రదర్శన కనబరిచి తృతీయ స్థానాన్ని దక్కించుకుంది. కీర్తన తయారు చేసిన ప్రాజెక్టుకు జిల్లా స్థాయిలో తృతీయ స్థానం దక్కింది. శుక్రవారం విజయనగరంలో జరిగిన జిల్లా స్థాయి నైపుణ్య పోటీల్లో జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల నుంచి విద్యార్థినిలు తాము సొంతంగా తయారు చేసిన నైపుణ్యాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిని జిల్లా కమిటీ పరిశీలించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలకు ఎంపికలు చేసింది. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.హెచ్. రమేష్ కుమార్, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది కీర్తనను, ఉపాధ్యాయురాలు బి.ఝాన్సీని శనివారం పాఠశాలలో అభినందించారు.



సాధించిన ప్రశంసా పత్రాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

మెరిసిన ఆదర్శ పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బక్కునాయుడుపేటలో ఆదర్శ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయిలో జరిగిన స్కిల్ కాంపిటేషన్ పోటీల్లో విజేతలుగా నిలిచారు. ముందుగా పాఠశాల స్థాయిలో నవంబర్ 3న నిర్వహించిన స్కిల్ కాంపిటేషన్‌లో విజేతలుగా నిలిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో ఐటి విభాగంలో ఎం. అరవింద్, ఎన్.సాయి, జితేంద్ర నాయుడు, ఆర్. చైతన్య, అపరల్ విభాగంలో బీ.హెప్సిబా, పి.యామిని ప్రియా, ఎం.లాస్య, ఎం.కోమలి రెండవ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వీరిని పాఠశాల ప్రిన్సిపల్ రావాడ ఈశ్వరరావు అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహించిన ఐటి ఉపాధ్యాయుడు జగదీష్‌ని, అపరల్ ఉపాధ్యాయిని దేవిని అభినందించారు.

పాత ఇనుప సామగ్రి షాపులో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి - చీపురుపల్లి



మంటల్లో కాలిపోతున్న షాపు

చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని కొత్త గవిడి వీధిలో గల బిసి గర్ల్స్ హాస్టల్ భవనం వెనుక ఉన్న పాత ఇనుప సామాన్ల షాపులో శనివారం అగ్ని ప్రమాదం సంభవించింది. గ్యాస్ సిలెండర్ పేలడంతో ఈ సంఘటన జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ క్రమంలో షాపులో ఉన్న ప్లాస్టిక్ వస్తువులు, రాగి, సిల్వర్, పాడైన టివిలు, పాడైన ఫ్రిజ్‌లు వంటివి పూర్తిగా కాలి బూడిదయ్యాయి. స్థానిక అగ్నిమాపక శాఖాధికారులకు స్థానికులు సమాచారం ఇవ్వడంతో హుటా హుటిన అగ్నిమాపక శాఖ వాహనంతో అగ్నిమాపక ఎల్ఎఫ్ఒ జి.ఆదినారాయణ ఆధ్వర్యంలో ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు లక్ష రూపాయలు మేర ఆస్థి నష్టం ఉంటుందని సంబంధిత యజమాని గంటా సతీష్‌కుమార్ తెలిపారు. బిసి వసతి గృహానికి ఆనుకొని ప్రమాదం జరగడంతో వసతి గృహం సిబ్బంది మేల్కొని స్థానికుల సహాయంతో వసతి గృహంలో ఉన్న గ్యాస్ సిలెండర్లను బయటకు తీసుకొచ్చారు. సంఘటన జరిగిన సమయంలో విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో వసతి గృహ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

నేరాలు ఘోరాలు

జమ్ములో విచారణ

ప్రజాశక్తి - గుర్ల

మండలంలో జమ్ము గ్రామంలో దుర్గాదేవి నిమజ్జనంలో పోలీసులకు గ్రామస్తుల మధ్య చెలరేగిన గొడవలో పోలీసులు కొంతమందిపై కేసు నమోదు చేసి విశాఖపట్నం జైలుకు తరలించిన సంగతి తెలిసిందే. ఆ కేసులో భాగంగా శనివారం నిందితులను సీన్ రీ కనస్ట్రక్షన్ నిమిత్తం గ్రామానికి తీసుకొచ్చారు. కేసు దర్యాప్తులో భాగంగా నిందితులను విచారిస్తున్నామని, మరి కొంతమంది నిందితులను అరెస్టు చేస్తామని ఎస్ఐ. పి.నారాయణరావు తెలిపారు.

కోర్టు తీర్పు వచ్చే వరకూ పనులు ఆపాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట



నిరసన తెలుపుతున్న జిందాల్ నిర్వాసితులు, నాయకులు

జిందాల్ యాజమాన్యం కంపెనీ పేరుతో చేస్తున్న భూదోపిడి తక్షణమే ఆపి, కోర్ట్ తీర్పు వచ్చే వరకూ సేకరించిన భూముల్లో అన్నీ పనులూ నిలుపుదల చేయాలని, జిఒ నెంబర్ 14 రద్దు చేసి భూ బదలాయింపు ఆపాలని సిపిఎం నాయకులు చల్లా జగన్ డిమాండ్ చేశారు. శనివారం బొడ్డవరలో నిర్వాసిత శిబిరం వద్ద మాట్లాడుతూ సేకరించిన భూమిని కంపెనీ కట్టనందున అధికారికంగా నిర్వాసితులకు ప్రభుత్వం అప్పగించాలని కోరారు. జిందాల కోసం సేకరించిన భూమిని జీవో నెంబర్ 14 ద్వారా ఎటువంటి బదలాయింపు చెయ్యొద్దని డిమాండ్ చేశారు. కోర్టులో తీర్పు వచ్చే వరకు భూముల్లో ఎటువంటి పనులు చేపట్టినా అడ్డుకుంటామని హెచ్చరించారు. నిర్వాసితులు మాట్లాడుతూ భూములు కోల్పోయిన తమకు ప్రభుత్వాల నుంచి గాని అధికారుల నుంచి కానీ స్పందన లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఎంఎస్ఎంఇ పార్కుల పేరుతో జిందాల్ యాజమాన్యం తమ భూములు తీసుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని ఆరోపించారు. తమకి న్యాయం జరిగే వరకూ పోరాడుతామని అన్నారు. గత 142 రోజుల గా నిరసన తెలియజేస్తున్నా ప్రభుత్వాలు పట్టనట్లు ఉన్నాయనీ ఆవేదన వ్యక్తం చేశారు.

గడ్డి మందు తాగి యువకుడు మృతి

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని నాతవలస టోల్ ప్లాజా వద్దగడ్డి మందు తాగి యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామభద్రపురం మండలం జన్నివలస గ్రామానికి చెందిన పత్తి గుల్ల పవన్ కుమార్ (18) గత నెల 26వ తేదీన బతుకుతెరువు కోసం ఇంటి నుంచి విశాఖపట్నం వెళ్లిపోయాడు. ఈ నెల 7వ తేదీన శుక్రవారం ఉదయం పెదనాన్న కుమారుడుకు తాను గడ్డి మందు తాగి చనిపోతున్నానని, టోల్ గేట్ దగ్గర ఉన్నానని సెల్‌కు మెసేజ్ పెట్టాడు. దీంతో వెంటనే గ్రామం నుంచి నాతవలస టోల్గేట్ వద్దకు వచ్చి పవన్ కుమార్‌ను విజయనగరం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అదే రోజు అర్ధరాత్రి చికిత్స పొందుతూ పవన్ కుమార్ మృతి చెందాడు. తండ్రి అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఏ.సన్యాసినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు అండగా సిఎం సహాయనిధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బొబ్బిలి



చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

పేదలకు సిఎం సహాయనిధి అండగా ఉంటుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. స్థానిక కోటలో శనివారం సీఎం సహాయనిధి చెక్కులను పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల వైద్యానికి సీఎం సహాయనిధి ఎంతో దోహదం చేస్తుందన్నారు. నియోజకవర్గానికి చెందిన కె.రేవతికి రూ.1.25లక్షలు, జి.నారాయణమ్మకు రూ.1.24లక్షలు, పి.శాంతమ్మకు రూ.1.20లక్షలు, జి.రజనికు రూ.1.16 లక్షలు సిహెచ్ జగన్‌కు రూ.97,358, జి.కుమారికి రూ.55,684, ఎం.ధనలక్ష్మికు రూ.51,048, దినేశ్‌కు రూ.90,405, కెవికెఎం రాజుకు రూ.50వేలు, కె.నాగరత్నంకు రూ.49, 811, ఎల్.కళాధర్ రావుకు రూ.40,787, బి.కావ్యకు రూ.30వేలు, సిహెచ్ మోహన రావుకు రూ. 25వేలు, ఎల్. లక్ష్మికు రూ.23, 400 చెక్కులను అందించారు. ఈ కార్యక్ర మంలో టిడిపి నాయకులు, పాల్గొన్నారు.